# మేథమెటిక్స్ మేడ్ ఈజీ?

"మేస్టారూ, చెట్టుతీరు చెబుతానన్నారు చెబుతారాండి?"

"చెట్టుతీరు కాదురా వెధవా, సెట్ థియరీ. కంపూటర్లలో దీన్ని ఉపయోగిస్తున్నార్ట ఎనిమిదో క్లాసు వెధవ్వి, పలకటమే రాకపోతే కంప్యూటర్నెట్టా ఉపయోగిస్తావురా?... సరే... కొన్ని వస్తువులున్న సమూహంలో ఏదైనా ఒక వస్తువు ఉన్నదీ లేనిదీ మనం ఖచ్చితంగా చెప్పగలిగితే ఆ సమూహాన్ని సెట్ అంటారు. సెట్లుకాని సమూహాలున్నాయి తెలాసా? .. ఉదాహరణకి, ఒక ఊళ్ళో ఒకే మంగలి ఉన్నాడనుకుందాం. సొంతంగా క్షౌరం చేసుకోలేని వాళ్లకి క్షౌరం చేసి పెడతాను అని ఆ మంగలి అన్నాడనుకొందాం. అప్పుడా ఊళ్ళో సొంతంగా క్షౌరం చేసుకో లేని వాళ్లందరికీ సమూహమూ సెట్ అవుతుందా, కాదా? - అవ్వదు. ఎట్లా, ఎట్లాగో ఆలోచించండి! ఇదే మీకు హోమ్‌కర్కు, హోమ్ వర్కు చేసిన వాళ్లే రేపు రండి. చెయ్యకుండా వస్తే డొక్కచించేస్తాన్ జాగర్త!....

★ ★ ★

" మేష్టారూ, మా అమ్మాయి మీ క్లాసే. రాత్రి అది నిద్దట్లో లేచి కూర్చుని 'మంగలి- క్షౌరం - డొక్క, క్షౌరం-డొక్క - మంగలి ' అని ఒహటే కలవరింత! లేపి కూర్చో బెట్టి 'ఏవిటే ఈ గోల!' అనడిగితే ఏదో చెప్పింది నా కర్థమయి చావలేదు. దాని కిహ నేనేం చెప్పను చెప్పండి. ఇరవయ్యేళ్ళ కిందట నా బియ్యే లెక్కల్లో ఈ అయోయమం లేదు మరి ! ... ఇంతకీ ఆ మంగలెవడో ఆ ఊళ్ళో ఉన్నట్టా లేనట్టా!"

" అయ అయ ... అమ్మ్యామ్యా. మ్మమ్మమ్మరండి. . క్షమించండి... అదేదో నాకూ అర్థమవ్వలేదు సార్...మీ బోటి పెద్దలెవరన్నాచెప్పి పంపిస్తారేమో అది చూసి మిగతా పిల్లలకి చెబుదామనుకున్నా... మామూలుగా తొట్టె నింపే పంపూ, ఓడ్చే పంపూ రెండూ ఒక్కసారి తిప్పితే తొట్టె ఎంత సేపట్లో నిండుతుందో చెప్పగల్ను. వడ్డీలు కట్టించగల్ను. ఇంతలో ఈ సెట్లగోలేదో హఠాత్తుగా వచ్చిపడింది ఈ ఏడాది. ఏం చేయను చెప్పండి! క్షమించాలి!"

" ఇవ్వన్నీ నా కనవసరం మేష్టారూ! చాలా మంది లాగే మా అమ్మాయి కూడా సామాన్యం పిల్లే. మీ పిచ్చి ప్రశ్నల్తో దానికి పిచ్చెక్కించకండి. అది పది పాసవ్వగానే నేను దాచుకున్న నాలుగు డబ్బుల్తో దానికి పెళ్ళి చేసేద్దామనుకుంటున్నాను. దానికి మతి మతిలో ఉండగానే ఎవణ్ణో పట్టుకొచ్చి దానికి పుస్తె కట్టనివ్వండి. అయినా నాకు తెలీకడుగుతాను మాష్టారు, అదిప్పుడు కంప్యూటరు కోర్సు చదువుతుందా, ఈ కరువురోజుల్లో నేను చదివిస్తానా? ఏదో కాస్త ఇంగ్లీషు పేపరు చదవగలగడం, ఆస్ట్రేలియా ఎక్కడుందో, కావల్సినన్ని రూపాయినోట్లు ఎందుకు అచ్చుగుద్దరో, సూర్యుడెందుకు ఎర్రగా ఉంటాడో, సైకిలు చక్రంలో గాలి ఎందుకుపోదో, ముఖ్య ఆరోగ్య సూత్రాలేమిటో ఇట్టాంటి ముక్కలేవో నాలుగు నేర్పండి చాలు. నిజాయితీ నేర్పండి సంతోషం. నాలుగు భక్తి పద్యాలు వల్లె వేయించండి ఆనందం . దానికి ఎక్కాలే సరిగ్గా మీరు చెప్పలేకపోయారే అంత కాలం బట్టీని, ఈ మేడ్-డిఫికల్ట్ లెక్కలేంటండి బాబూ, సెట్లూ గట్లూను!... అమ్మాయిని మీ చేతిలో పెట్టాక చేసేదేముంది, మీ దయ మా ప్రాప్తి కాక అంటారా నేన్నోరు

మూసుకుంటా... వస్తా"

★ ★ ★

" కాలేజీ స్టూడెంట్ల లెక్కచేసిన వాళ్ళు నుంచోండ్రా! ... ఆఁ, ఆన్సరెంత?"

" లెక్కలు ఒక్కటే చదివేవాళ్ళెవ్వరూ ఉండరు సార్ అందుకని ఆన్సరు సున్న!"

" తప్పురా ఫూల్! . అయినా ఎట్లా చేసావో చెప్పు!"

" మరండీ, మరి ... ఎట్లా చెయ్యాలో తేలీక మానాన్నగారూ నేనూ కాలేజీ కెల్లి అక్కడ అడిగామండి. లెక్కలు ఫిజిక్సూ కెమిస్ట్రీ చదివే వాళ్ళున్నారంటండి. లెక్కలు కామర్సూ చదివేవాళ్ళు లేరంటండి! లెక్కలొక్కటే చదువుతానంటే అసలు సీటే ఇవ్వరంటండి మరి మీరేమో అళ్ళు యాభై ఈళ్ళు ముప్పై ఈళ్ళు అరవై అయితే లెక్కలు ఒక్కటే చదివే వాళ్ళు ఎంత మంది అని అడిగారండీ ఆన్సరు సున్నే కదండి!"

" ఓర్నీ! . ఆన్సరు సున్న కాదురా, జవాబుల్లో ఉంది చూడు". " అదెట్లాగో బోర్డుమీద చెప్పండి సార్!"

" బోర్డా! అదెక్కడుందిరా? మూడు ముక్కల్లోనూ ఒక ముక్కని పంచాయితీవాళ్ళు ఎత్తుకుపోయారు. ఇంకోటి నా బల్లమీదేసి మేకులు కొట్టారు. మూడోది ఇదిగో, అడ్డంగా తిరిగుంది."

" దానిమీదే చెప్పండి "... " సరే సుద్దముక్క వెతకండ్రా."

" ఇదిగో మాస్టారూ,ఇన్స్పెక్టరుగారొచ్చినప్పుడు తెప్పించిన ముక్కఇక్కడ ఇసకలో దొరికింది"

" ఆఁ ఇవ్వండి... ఇదిగో వెన్న చిత్రం - అంటే వలయాలన్నమాట, ఛత్, ఇసకంటుకొని పోయిందిరా, రాసిచావదే!.. టెక్స్ట్ పుస్తకాలు తియ్యండ్రా చూపిస్తాను "

" షాపులోకి ఇంకా రాలేదంటండి. ఏప్రిల్ లో వస్తాయంటండి,"

" మరిప్పుడేం చేద్దాం! సిలబస్ అవ్వాలే!". " సిలబస్ అయిపోయిందనే చెబుతాంలెండి... పోయి ఆడుకుంటాం సార్ ... పదండ్రా.."

" ఆహా, మేథమాటిక్స్ టీచింగ్ ఎంత ఈజీ అయిపోయిందిరా!"

( క్రోక్విల్ హాస్యప్రియ 1-15 అక్టోబరు 87)

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★